# ఆంధ్రప్రదేశ్ ఉద్యాన విశ్వవిద్యాలయము



# ఉల్లి

**నేలలు :**

5.8-6.5 ఉదజని సూచికతో నీరు బాగా ఇంకే సారవంతమైన ఎర్రనేలలు, గరపనేలలు, కండగల నేలలు అనుకూలం. ఉల్లి చౌడును తట్టుకోలేదు.

**సాగుకు అనువైన కాలం :**

జూన్-జూలై, సెప్టెంబరు-అక్టోబరు నెలలు నారుపోసి నాటడానికి అనుకూలం. కె.పి. ఉల్లిరకం సాగుకు జూన్-ఆగష్టు నెలలు విత్తుకోవడానికి మంచివి.

**రకాలు :**

ముదురు ఎరుపురంగు రకాలైన అగ్రిఫౌండ్ డార్క్‌రెడ్, బళ్ళారిరెడ్, అగ్రిఫౌండ్ రోజ్, బెంగుళూరు రోజ్, అర్క కళ్యాణ్, ఎన్-53 ఖరీఫ్‌లో సాగుకు అనుకూలం. లేత ఎరుపు రకాలైన అగ్రిఫౌండ్ లైట్‌రెడ్, నాసిక్ రెడ్, పూసారెడ్, అర్కనికేతన్ రబీలో సాగుకు అనుకూలం.

**విత్తన మోతాదు :**

ఎకరాకు 2.5-3 కిలోల విత్తనం అవసరమౌతుంది. ఉల్లి విత్తనాలు త్వరగా మొలకెత్తే శక్తి కోల్పోతాయి. విత్తనాన్ని తీశాక 9 నెలల్లోపే విత్తుకుంటే 90 శాతం పైగా విత్తనాలు మొలకెత్తుతాయి.

**విత్తన శుద్ధి :**

నారుపోసే ముందుగా కిలో విత్తనానికి 2 గ్రాముల కాప్టాన్ లేదా థైరమ్‌తో విత్తన శుద్ధి చేయాలి. తరువాత నారు పోసేముందు రోజు కిలో విత్తనానికి 2.5 గ్రాముల అజోస్పైరిల్లమ్ (జీవన ఎరువు) తో విత్తనశుద్ధి చేసి విత్తుకుంటే నారు బలంగా పెరుగుతుంది.

**నారు పెంపకం :**

నేలను బాగా దున్ని 1.2 మీ. వెడల్పు, 3 మీ. పొడవుగల ఎత్తైన నారుమళ్ళను తయారు చేసుకోవాలి. ఎకరాకు సరిపడే విత్తనాన్ని పలుచగా వరుసల్లో విత్తుకోవాలి. విత్తిన తరువాత నీరు చల్లి పైన ఎండుగడ్డి లేదా ఎండిన ఆకులు కప్పితే విత్తనం బాగా మొకకెత్తుతుంది. విత్తనం మొలకెత్తిన తరువాత ఎండుగడ్డిని లేదా ఎండిన ఆకులను తీసివేయాలి. నారుమడిలో చీడపీడల నివారణకు లీటరు నీటికి 2 మి.లీ. మిథైల్ డెమటాన్ లేదా డైమిథోయేట్‌ను 3 గ్రాముల డైథేన్ యం-45 లేదా 1 గ్రాము కార్బండిజమ్‌లలో కలిపి నారుపోసిన 3, 5 వారాలకు రెండుసార్లు పిచికారి చేయాలి.

**నారు నాటడం :**

40-45 రోజుల వయస్సున్న నారు పొలంలో నాటుకోవాలి. వరుసల మధ్య 15 సెం.మీ. మొక్కల మధ్య 10 సెం.మీ. ఎడంతో నాటుకోవాలి. నారును 1 శాతం (1 గ్రాము/లీటరు నీటికి) కార్బండిజమ్ ద్రావణంతో ముంచి నాటడం వల్ల నారు కుళ్ళు సోకకుండా ఉంటుంది.

**కలుపు నివారణ :**

ఎకరాకు 1.4 లీటర్ల పెండిమిథాలిన్‌ను 320 లీటర్ల నీటికి కలిపి నారునాటే ముందు లేదా నారు నాటిన మూడు రోజుల తరువాత ఎకరా పొలంలో పిచికారి చేయాలి. నారు నాటిన 30 రోజుల తరువాత కూలీలతో కలుపు తీయించి మట్టిని ఎగదోయాలి.

**ఎరువులు :**

ఎకరాకు 10 టన్నుల పశువుల ఎరువు, 50 కిలోల యూరియా, 180 కిలోల సింగల్ సూపర్ ఫాస్ఫేటు, 40 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను దుక్కిలో వేయాలి. నాటిన 30-40 రోజులకు ఎకరాకు 50 కిలోల యూరియా, 25 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను పైపాటుగా వేయాలి. నాటిన 60, 75, 90వ రోజున 2 కిలోల యూరియా 6 కిలోల పొటాషియం సల్ఫేట్‌ను 200 లీటర్ల నీటితో కలిపి ఎకరా పంటపై పిచికారీ చేస్తే అధిక దిగుబడితోబాటు గడ్డల నాణ్యత పెరుగుతుంది.

**నీటి తడులు :**

గడ్డలు ఏర్పడేదశ, ఊరేదశలు తేమకు సున్నిత దశలు. ఈ దశల్లో నీటి ఎద్దడి రాకుండా క్రమం తప్పకుండా నీరు పెట్టాలి. కోతకు 10-15 రోజుల ముందు నీరు పెట్టకూడదు.

**ఆరబెట్టుట, క్యూరింగ్ :**

ఖరీఫ్, రబీ కాలాల్లో 3-5 రోజుల వరకు గడ్డలను పొలంలోనే ఆరబెట్టాలి. ఇందుకు విండ్‌రో క్యూరింగ్ అనే ప్రత్యేక పద్ధతి ఉంది. ఉల్లిపైరును గడ్డలతో బాటుగా భూమినుండి తీసిన తరవాత వరుసలతో ఉంచుతూ తరువాత వరుసలో పీకిన గడ్డల పైభాగాన ఉన్న మొక్క ఆకుల్ని ముందు వరుసలో ఉంచిన గడ్డలను కప్పుతూ ఉంచాలి. తరువాత 7-10 రోజుల వరకు నీడలో ఆరబెట్టాలి. నీడలో ఆరబెట్టిన తరువాత 2-2.5 సెం.మీ. కాడ ఉండునట్లుగా గడ్డలను కోయాలి.

**సస్యరక్షణ :**

**ఊదారంగు ఆకుమచ్చ తెగులు :**

నివారణకు మాంకోజెబ్ (2.5 గ్రా/లీ) లేదా క్లోరోథలోనిల్ (2 గ్రా/లీ) లేదా అలియేట్ (2 గ్రా/లీ)ను 10-12 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారి చేయాలి. శాండోవిట్ లేదా అప్సా-80 (0.5 మి.లీ./లీ.) లాంటి జిగురు పదార్థాలను తప్పక కలిపి పిచికారి చేయాలి.

**తామర పురుగులు :**

డైమిథోయేట్ (2 మి.లీ. /లీ.) లేదా మిథైల్ డెమటాన్‌ను పిచికారీ చేసి నివారించవచ్చును.

**నిల్వలో గడ్డలు కుళ్ళడం :**

నారు నాటిన 90 రోజులకు కార్బండిజమ్ (1 గ్రా/లీ)ను పిచికారీ చేస్తే నిల్వలో గడ్డలు కుళ్ళడం తగ్గుతుంది.